జంపన పెద్దిరాజు స్మారక కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి రు. 116 గెలుపొందిన రచన

# బలి

## పాపినేని శివశంకర్

ఆ చుట్టు పక్కల పది వూళ్ళలో ఎవర్నడిగినా చెబుతారు సుబ్బయ్య చౌదరంటే ఎవరో ఏమిటో! మీసం మెలేసి లేచాడంటే యముడైనా గుండెలవిసి చావాల్సిందే. అంత భయంకర విగ్రహం ఆయనది.

ఆరున్నర అడుగులు పొడుగు, పొడుగుకి తగ్గలావు, మొహం మీద మచ్చలు, నెత్తురు చిమ్మే కళ్ళు, వాళ్ళ వంశమే అంత. తాళ్ళగడపలో మూరెకరాల ఆసామీ సుబ్బయ్య చౌదరి. సగం వూరికి మకుటంలేని రాజు.

ఆ వూళ్ళో వెయ్యి గడప కంటే లేకపోయినా పార్టీలు మాత్రం రెండున్నాయి. తరతరాల నుంచి పల్లపు వీధి కాకి ఉత్తర వీధిన వాలడానికి వీల్లేదు. ఒక వర్గానికి చౌదరి నాయకుడైతే మరొక వర్గానికి మునసబు నాయుడు నాయకుడు.

ఆ రోజు పొద్దెక్కే వేళకి చౌదరయ్య అగ్గిమీద గుగ్గిలంలా మండిపోతున్నాడు. పాతకాలం భవంతి మొగదల వీధి అరుగుమీద కూర్చున్నాడు. కళ్ళు చింత నిప్పుల్లా వున్నాయి. నోట్లో జానెడు లంక పొగాకు చుట్ట వెలుగుతోంది ఎర్రగా. పక్కనే వూళ్లో ఆయన కున్న పెద్ద దన్ను కామయ్య నాయుడు రెడ్డిగం వేసుకు కూర్చుని వున్నాడు. మరో పక్క ఇంకొంత మంది పెద్ద మనుషులున్నారు. ఎదురుగా పాలేళ్ళు, కూలీ వాళ్ళూ పాతిక మంది దాకా చేతులు కట్టుకు నిలబడ్డారు.

"తల్లి సిగ దరగ! ఈ వూళ్ళో నా నామికి నిప్పెబెట్టే దమ్ములు గూడా వుండయ్యన్నమాట. అదీ జూస్తాను. వారం రోజుల్లో నిప్పెబెట్టినోడి నెత్తురు కళ్ళ జూడక పోతే నేనొక అమ్మకీ అయ్యకీ పుట్టినోణ్ణేకాదు. అయినా దొంగనాయాళ్లారా! పట్నవెల్తా కనుగలిగి వుండండ్రా అని వారిగాడితో జెప్పి పంపితే మీరు జేసిన నిర్వాక మిదా? అంబోతుల్లాగా మెయ్యడానికి దప్ప ఎందుకు బనికొస్తారా మీరు? థూ!" అని కాండ్రించి వుమ్మే శాడు సుబ్బయ్య చౌదరి.

ఎవ్వరూ మాట్లాడలేదు. క్రితం రోజు పట్నం మంచి కబురొచ్చింది, చౌదరయ్యని వున్న పళంగా రమ్మని. నోట్లో ముద్ద నోట్లో వుండగానే బయల్దేరాడు. పక్కన నమ్మిన బంటు వారిగాడు తప్ప సమయానికి తోడెవరూ లేరు. ఊరి పొలిమేరలు దాటిన తర్వాత వారిగాణ్ణి వెనక్కి పంపిస్తూ చెప్పాడు, ఇల్లూ కొట్టమూ జాగ్రత్తని. ఆ రాత్రే గొరకొయ్యలు వాటారే వేళకి చౌదరయ్య కొట్టంలోంచి ఉవ్వెత్తున మంటలు లేచి గడ్డివాము తగలబడింది. కొట్టంలో కట్టేసిన గేదె, దూడా చచ్చిపోయాయి. గిత్తలు మాత్రం తాళ్లు తెంపుకు బయట పడ్డాయి. పొద్దున్నే సుబ్బయ్య తాళ్ల గడప చేరే సరికి కొట్టం మొండిగోడలూ, కాలిన వాసాలు, పైకి లేస్తున్న పొగలూ కళ్లబడ్డాయి. కడుపు దేవినట్టయింది. ఇంత జరుగుతుంటే వారిగాడూ, పాలేళ్లూ ఏం చేస్తు న్నట్టు? నిలబడి వున్న మాదిగోళ్లో వీరేసు మాత్రం ధైర్యం చిక్కించుకుని సమాధానం చెప్పాడు.

"వారిగాడు మాకేం చెప్పలేదయ్యా! రాత్రి మంచి మా కంటికే కానల్లేదు."

సుబ్బయ్య చౌదరికి కోపం నసాళమంటింది.

"అయ్! వారిగాడు మీకేం జెప్పలేదా? ఎక్కడ నచ్చాడు? వున్న పళాన ఆ లంజాకొడుకుని లాక్కు రాండిరా."

వీరేసు పొట్లోకి పరిగెత్తాడు. మునసబే ఈ పని చేయించాడని కామయ్య నాయుడు చెబుతున్నాడు అక్కడి వాళ్ళతో. మునసబు నాయుడికీ, కామయ్య నాయుడికీ దాయాది వైరాలున్నాయి. పక్కనే వున్న మరో పెద్ద మనిషి అందుకున్నాడు.

"అదిగాదు కక్కాయ్! అసలు వారిగడే మునసబు తట్టుజేరి ఈ పని చేశాడేమో?" సుబ్బయ్య చౌదరి అదిరి పడ్డాడు.

సుబ్బయ్యకీ, వారిగాడికీ వున్న సంబంధం ఈనాటిది కాదు. తరతరాల నాటిది. చౌదరయ్య తండ్రి దగ్గర వారిగాడి తండ్రి ముత్తయ్య పని చేశాడు. చౌదరయ్య పొలం ఈనాటికి వంద ఎకరాలయ్యిందంటే దాని వెనక వారిగాడి పూర్వీకుల చాకిరీ లేకుండా ఎలా వుంటుం ది? వారిగాడి వంశమే అంత. నమ్మిన వాళ్ళకి ప్రాణా లివ్వడమే వాళ్ల ఆనవాయితీ. వారిగాడి తాత కమ్యూనిస్టు హడావుడిలో చౌదరయ్య తాతను కాపాడబోయి ప్రాణా లకు తెచ్చుకున్నాడు.

సుబ్బయ్య చౌదరీ, వారిగాడూ ఒక్కరోజే భూమ్మీద పడ్డారు. చౌదరయ్య తల్లి గర్భవాతంతో పురిట్లోనే పోయింది. తల్లిలేని బిడ్డని వారిగాడి తల్లే పాలిచ్చి పెంచింది. ఊహ వచ్చిన దగ్గర్నుంచి వారిగాడు చౌదరయ్య నంటిపెట్టుకునే వున్నాడు. వాడి విశ్వాస మెంతటిదో, వీరావేశ మెటువంటిదో చౌదరయ్యకి తెలుసు. ఊరందరికీ తెలుసు. పదిహేనేళ్ల కిందట చౌదరయ్య వయసు పొంగులో పల్లపువీధి సావిత్రిని మరిగాడు. పల్లపు వీధంతా మునసబువర్గం. చౌదరయ్య తండ్రికి పెద్ద మునసబుకి వైరం తారస్థాయిలో వున్న రోజులవి. కొడుకు పోకిర్పు తెలిసిన శేషయ్య ఆ వీధికి వెళ్లొద్దని నయాన భయాన చెప్పి చూశాడు. చౌదరయ్య వినలేదు. ఒకరోజు రాత్రి మునసబు మనుచౌదరయ్యను కొట్టాలని సావిత్రి ఇంటి దగ్గర కాపేశారు. సంగతి తెలిసిన చౌదరయ్య ఏం చేద్దామని వారిగాణ్ణి సలహా అడిగాడు. పై అంటే పై అన్నాడు వారిగాడు. నిముషాల మీద ఇరవైమంది మనుషుల్ని సిద్ధం చేశాడు. ముందుగా వారిగాడు. వాడి వెంట చౌదరయ్య. ఒక అడుగు వెనగ్గా ఇరవైమందీ వెన్నుగాయాలి. అవసరమైతే ఈల వెయ్యగానే ముందుకు దూకాలి. అదీ పథకం.

ఊరు నిద్ర పోతోంది. చీమ చిటుక్కుమంటే వినబడే నిశ్శబ్దం. మసక వెలుతుర్లో వారిగాడు బాణా కర్రతో ముందు నడుస్తుంటే చౌదరయ్య బయల్దేరాడు. వీధిలో ఎవరూ తారసిల్ల లేదు. సావిత్రి ఇల్లు చేరిన తరువాత చౌదరయ్యను లోనికి పంపి వాకిలి ముందు నిలబడ్డాడు వారిగాడు. అరగంట గడిచిందో లేదో పక్కన చీకట్లో అలికిడి అయ్యింది. పది మంది మునసబు మనుషులు ఒక్కసారిగా ఇంటి చుట్టూ కమ్మారు. వారిలో ఒకడు ముందుకు వచ్చి "మీ దొరగార్ని ఓ సారి బైటికి పిలవరా" అన్నాడు.

"ఎందుకురా?" అన్నాడు వారిగాడు తనూ 'రా' కొడుతూ.

"పనుంది."

"దొరగారిప్పుడు బైటికి రారు."

"రావాలి."

"రాకపోతే?"

"నీ వుచ్చె బంతికిమల్లే ఎగిరి పోద్ది" అంటూ కర్రెత్తాడు.

వారిగాడు ఒక్క సారి కేక పెట్టి వాళ్ల మీద విరుచుకు పడ్డాడు. కర్రసాములో ఆరి తేరిన వాడుగావడం చేత పది మందినీ పదినిముషాల సేపు ముందుకు రానివ్వలేదు. చూస్తుండగానే ఇద్దర్ని మట్టి కరిపించాడు. కానీ అంత మంది మీద ఒక్కడూ తిరగబడడం సాధ్యం కాకపో యింది. ఎడమ చెయ్యి విరిగింది. ఇక లాభంలేదని కర్ర తిప్పుతూనే ఊరు దద్దరిల్లేట్టు ఈల వేశాడు. మరుక్షణం ఇరవై మంది అంచెల మీద వాలారు. ఊరు నిద్ర లేచింది. ఆ ఘర్షణలో ఇద్దరు మునసబు మనుషులు

వచ్చిపోయారు. మర్నాడు మునసబు కేసు పెట్టాడు. చౌదరయ్య తప్పించుకున్నా వారిగాడికి రెండేళ్ళు జైలు శిక్ష పడింది. రెండేళ్ళూ నిర్విచారంగా గడిపి మరింత రాటు దేలి వచ్చాడు. అప్పటి నుంచీ సుబ్బయ్యకి వాడంటే ఎంతో గురి. అటువంటి వారిగాడు మునసబు వర్గంతో చేతులు గలుపుతాడా?

చౌదరయ్య ఆలోచన తెగేలోపున వీరేశు వచ్చాడు. వాడివెనకే పదిహేనేళ్ళ కొడుకు చెయ్యి పట్టుకు నడిపిస్తుంటే వారిగాడు వణుకుతూ వచ్చి నిలబడ్డాడు. చౌదరయ్య మాదిరే నిలువెత్తు. మనిషి కాయకష్టంతో సాము గరిడీలతో కండలు తిరిగిన ఒళ్ళు, బవిరి గడ్డం,




నల్లటి చాయ. వాణ్ణి చూడగానే సుబ్బయ్య కంఠం ఖంగున మోగింది.

"ఓరి దొంగలొత్తు కొడక! రాత్రి నే జెప్పిందేంది? నువ్వు చేసిందేంది? కొట్టం ఆ పాట్న తగలబడతంటే పెళ్ళాన్ని సందేసుకుని కులుకుతున్నావంట్రా? గేడి కొంగల్లే నిలబడి మాట్లాడ వేందిరా?"

వారిగాడు కళ్ళ నీళ్ళ పర్యంతమయ్యాడు.

"నాకేం తెలీదు దొరా! ఇప్పుడే ఈరేసు చెప్పాడు. నిన్నటి నుంచి జెరం. అట్టనే వణ్ణుకొస్తింది. మాపటేలకి జరమెక్కువైంది. తవరితో పొలిమేర దాటి మళ్ళీ ఊళ్ళో కొచ్చి పడిపోతే కోటాయ్ మోసి కొంపకి జేర్చాడు. రేత్రంతా తెలివిలేదు" అన్నాడు వారిగాడు చేతులు నలుముకుంటూ.

"నోర్మూయ్యి ఎదవాని ఎదవ! ఆటేపు జాగ్రదా కొట్టమెట్టా తగలబడిందో? గొడ్డు గోదా నీ ఎదాన బెట్టుకుంటివి గదరా! కోడిదూడ ఎట్టాంటి సోడిగలది? వంక బెట్టలేని పుటక. అదీ చచ్చిందిరా నీ మూలంగా" అన్నాడు చౌదరయ్య.

"అవలీడి వత్తాను లేందే ఇంత గోరం జరిగుండువా అవి? ఎంత జరమైతే మాత్రం మాట మాత్రం పాలేళ్ళకి జెప్పండొచ్చువే. పైగా మువ్వ పట్నం ఎల్లినట్టు ఈడికి దవ్వవరమావవుడికి తెలీదు. మరి మువవబు మమషులి కెట్టా ఆమాకీ దెలిపినట్టూ?" అన్నాడు కరణం పంతులు లాపాయింటు దీసి.

వారిగాడు కుప్పగూలిపోయాడు. పులిమీద పుట్ర ఇది. అందరూ తనవంకే చూస్తున్నారు. ఇంతకన్నా సిగ్గుమాలినతనమేముంది? కల్లోగూడా దొరగారికి కీడు తలపెట్టలేదు తను. ఇంత అభాండమా? ఇంతకీ కొట్టమెట్టా తగలబడినట్టు? తన ప్రాణానికి ప్రాణమైన కోడెదూడ ...

వారిగాడు చివ్వున లేచి కొట్టంవైపు పరిగెత్తాడు. వామి పూర్తిగా తగలబడి అంతెత్తున బూడిద మాత్రం మిగిలింది. గోడలన్నీ పొగచూరిపోయాయి. పై వాసాలు కూలిపడి కొట్టంలో కట్టేసిన గేదె, దూడ పేగులు వెళ్ళుకొచ్చి చచ్చాయి. కోడెదూడ కాలి నల్లగామారి కంపుగొడుతోంది. వారిగాడి కదుపు తరుక్కుపోయింది. రాముడు తన రెండో కొడుకు. అది పుట్టిన రోజే చౌదరయ్య ఎన్నికల్లో గెలిచాడు. అప్పటి నుంచీ దాన్నెట్లా పెంచాడు తను? దొరగారిని చూసినా బుసలు గొట్టేదిగానీ తన దగ్గర మొరాయించేది గాదు. రాత్రి



శ్రీ పాపినేని శివశంకర్....

పూట మంచమేసుకుని పడుకుంటే వళ్ళంతా వాకేది ఇప్పుడిప్పుడే కాడికిందికి అలవార్చుతున్నాడు. ఇంతలో ఈ ఘోరం.

వారిగాడు మళ్ళీ చౌదరయ్య కంటబడలేదు. పెద్ద పెద్ద అంగల్తో తన గుడిసె కెళ్ళాడు. చూరులోంచి పొడుగాటి కత్తి తీసి బండమీద నూరసాగాడు. జ్వరం, గిరం ఎటెగిరిపోయిందో? కళ్ళు జ్యోతుల్లాగున్నాయి. మొహం కందగడ్డయింది. పెళ్ళాం మంగి ఇదంతా చూస్తూ వుండబట్టలేక —

"ఇదేందయ్యా! అంతిమురుగుండా వేంది? జరం గాని మళ్లీ తిరగబెడితేయెట్టా? వళ్ళెట్టుందో మాణ్ణెయ్యి" అంటూ దగ్గరకొచ్చింది.

వారయ్య ఒక్క విసురుతో పెళ్ళాన్ని పక్కకి నెట్టాడు. తలెత్తలేదు. కత్తి నూరుడు ఆపలేదు. మంగి మళ్ళీ నోరెత్తడానికి భయపడింది. ఆ కత్తి వారయ్యకు వంశపారంపర్యంగా వచ్చిన ఆస్తి.

ఆ రోజంతా వారిగాడు గుడిసెలో కుక్కిమంచంలో పడుకుని కప్పు వంకే చూస్తూ గడిపాడు. భార్యాబిడ్డల్తో మాట్లాడలేదు. కూడూ, నీళ్ళూ ముట్టలేదు. మర్నాటి నుంచి ఆరాదీయసాగాడు. కొట్టం తగలబడ్డ రాత్రి ఎవ రెవరు పల్లెలో వున్నారు? మూడోవాటి కల్లా కొట్టం తగలబెట్టిందెవరో రూఢి పరుచుకున్నాడు. ఆ రోజు రాత్రి వారిగాడెవ్వరి కంటికీ కన్పించలేదు.

* * *

తెల్లారింది. సుబ్బయ్యచౌదరి వీథి అరుగుమీద కూర్చుని పళ్ళుతోముకుంటున్నాడు. అటే వస్తున్న వారిగాణ్ణి చూసి నేలమీద తుపుక్కున వూసి, మొహం తిప్పుకున్నాడు. వారిగాడు మెల్లగా దగ్గరి కొచ్చి మొల్లో కత్తి తీసి చౌదరయ్య కాళ్ళ దగ్గరుంచాడు. చౌదరయ్య చూశాడు. కత్తిమీద నెత్తురెండిపోయి నల్లగా అట్టకట్టి







వుంది. అదెవరి నెత్తురో వారిగాడు చెప్పలేదు. చౌదరయ్య అడగనూ లేదు. ఆ మనిషెవరో ముఖ్యంగాదు చౌదరయ్యకి. పగదీర్చుకోవడమే, పరువు నిలబెట్టడమే కావాల్సింది. ఒక్కసారి తలెత్తి వారిగాడి వంక చూశాడు. వాడి చూపుల్లో అంతులేని విశ్వాసం. చౌదరయ్య చెయ్యి అప్రయత్నంగా మీసం మీదికి పోయింది.

"శభాష్ వారిగా!" అన్నాడు.

క్షణాలమీద ఈ వార్త ఊరంతా గుప్పుమంది. చౌదరయ్య వర్గం వాళ్ళంతా వచ్చి వారిగాడి ధైర్యాన్నీ, విశ్వాసాన్నీ మెచ్చుకుని ఆకాశానికెత్తేశారు. ఆ రాత్రి చౌదరయ్య వాడికి తాగినంత కల్లు పోయించాడు. వారిగాడు వీథుల్లో గంతులేస్తూ గుడిసెకి వెళ్ళాడు. ఏడుస్తూ కూర్చున్న మంగి వాణ్ణి చూడగానే బారలు సాస్తూ మీద కొచ్చింది.

"ఒరి పీన్గుత్తర దగల! ఎంకటేసును బొడిసావంట గదరా! మళ్లీ జైలుకెల్తువుగాని, కులపోల్లలో సెడబుట్టితివి గదరా! ఇంక తలెత్తుకెట్టా దిరిగేది?"

"శా ఎదవ ముండవి! ఆ దొంగ నాకొడుకులు దొరగారి కొట్టం తగలబెడితే నీమూ, నెత్తురూ సచ్చి కూసోమంటావేందే? పరువుబోయినాక వుట కెందుకే? ఇశ్వాసం గలోణ్ణి గనక సగదీర్చుకున్నా. తప్పేంది?"

"ఆయన కొట్టం తగలబడితే మయాన నువ్వెవుడి ంట పగదీర్చుకోవడానికి? కుక్క సెత్తనం గాడిద బెట్టుకున్నట్టు సెతి దానికీ తయ్యిమంటూ బోతా వేంది? ఆయనకేం డబ్బున్న మారాజు. సల్లంగానే వుంటాడు. మద్దెన నువ్వేగంద జైలుకెల్లేది?"

"రాసి పెట్టుంటే యెల్లక తప్పద్దేంది? దొరగారి కోసం జైలుకెల్తే మాత్తరం వేంది? మారాజులా గెల్లొత్తాను" అని సైసంచె దులిపి కుక్కిమంచంలో కూలబడ్డాడు వారిగాడు.

"మారాజులా గెల్లొత్తావు. ఎల్లిరావు మరీ! కొంపలో పెల్లాం పిలగాళ్ళు సత్తేనీకేం? బతికితే నీకేం? మొకానికి సిగ్గా సెరవా? ఊరోల్లంతా ఉమ్మేత్తన్నారు నువ్వు చేసిన పనికి."

"ఏందే సతాయిత్తన్నావ్? నరికి పోగులేత్తాను, జాగర."

"ఆదేగా నువికి జేతయ్యింది?" ఈసడించింది మంగి.

"శాత్ లం..ముండా! నిన్ను ... నిన్నూ ..." అంటూ లేచాడు వారిగాడు. చేతికందిన కర్ర దీసుకుని గొడ్డును బాదినట్టు బాదాడు. కొడుకు అడ్డుపడబోతే వాడికీ వాలుగు తగలనిచ్చాడు. మంగి శోకాలు బెట్టి యేడ్చింది.

"ఓలమ్మో! సంపేత్తన్నాడే ముదనట్టపోడు! నేనేం జేతును దేవుడో! ఓ లప్పో! ఓ సెంకీ! ఈడి జిమ్మబడ! ఈడూ, ఈడి దొరా యేట్లో గలన! ..."

"మద్దెన దొరగార్ని సాసిత్తావంటే? నీయమ్మ! మళ్లీ నోరెత్తు ... నోరెత్తు సెబుతా" అంటూ మళ్ళీ మళ్ళీ కొట్టాడు.

మంగి వళ్ళు సచ్చి పుండయ్యింది. చేతిలో కర్ర విరిగిపోయింది. దాన్ని అవతలపడేసి నిమురుగా కల్లుపాకకెళ్ళాడు వారిగాడు.




వెంకటేసు కూనీ వూరికే పోలేదు. మునసబు కేసు పెట్టించాడు. పోలీసు కుక్కలొచ్చాయి. వాగులో వెంకటేసు శవం దొరికింది. వారిగాడు అరెస్టయ్యాడు. ఏడాది విచారణ తర్వాత వారిగాడికి వాలుగేళ్ళు కఠిన కారాగార శిక్షపడింది. చౌదరయ్య పై కోర్టుకి అప్పీలు చేద్దామన్నాడు గానీ వారిగాడే వారించాడు. వాలుగేళ్ళంటే ఎంతసేపు? దాని కోసం వేలకి వేలు కోర్టులకి ధారపొయ్యటమెందుకు? జైలు కెళ్తూ వెళ్తూ వారిగాడు కొడుకుతో మరీ మరీ చెప్పాడు, దొరగారి పనిలో ఏమరవద్దని. వారిగాడు జైలు కెళ్ళడంతో చౌదరయ్య కుడిభుజం విరిగినట్టయ్యింది. మునసబుకి వారిగాడు గుండె గాలం. అంత తెగింపుగల మనిషి తాళ్ళగడపలో ఇంకొకడు లేదు. ఆ వాలుగేళ్ళూ చౌదరయ్య గుబులుగానే బతికాడు. వారిగాడి పెళ్ళాం, పిల్లలకి మాత్రం లోటు లేకుండా చూశాడు.

* * *

ఊళ్ళో వినాయకచవితి సంబరాలు మొదలయ్యాయి. తెల్లారితే చవితి. పల్లం వీధివాళ్ళకో వినాయకుడు. ఉత్తరం వీధివాళ్ళకో వినాయకుడు. ఊరేగింపుకి రెండు వర్గాలవాళ్ళూ ఎవరి సన్నాహాల్లో వాళ్ళున్నారు. కొట్లాటలకి వ్యూహాలు పన్నుతున్నారు. ఇంతలో ఊరంతా గుప్పుమంది. వారిగాడు జైలు నుంచి వచ్చేశాడు! చౌదరయ్యకి వెయ్యేనుగుల బలం వచ్చింది. వారిగాడిని ఊరేగింపుగా ఊళ్ళోకి తెచ్చారు చౌదరయ్య వర్గంవాళ్ళు. వారిగాడు గుడిసెక్కూడా వెళ్ళకుండా సరాసరి చౌదరయ్య దగ్గరికొచ్చి దణ్ణం పెట్టి నిలుచున్నాడు. చౌదరయ్య తేరిపార చూశాడు. మునుపటికన్నా మనిషి నల్లబడ్డాడు. దవడలు లోపలికి పోయి మొహం పీక్కుపోయింది. అక్కడక్కడా తల నెరిసింది. కానీ వాడి కళ్ళల్లో అదే చెక్కుచెదరని విశ్వాసం. చౌదరయ్య వెంటనే వాణ్ణి లోపలికి తీసుకుపోయి కడుపు నిండా తిండి పెట్టించాడు. ఆ రాత్రి మంగి వాడికి కాళ్ళు పడుతూ అంది —

"ఇంకైనా బుద్ధి గలిగుండయ్యా! సెడసరంగా తగాదాల్లో తలదూర్చమాక. ఒకేపున వాడు పెద్దవుతున్నాడు. వాడి పెళ్ళున్నా ఆలోసించు."

మంగి కళ్ళ నుంచి కన్నీళ్ళు టపటపా రాలాయి.

"ఎర్రి మొకమా!" అన్నాడు వారిగాడు. కొడుకును గురించి తనాలోచించేదేమిటి? దొరగారి పంచన వాడూ తనమాదిరే రాజాగా బతుకుతాడు.

తెల్లారి నిద్రలేస్తూనే వారిగాడు దొరగారి కొట్టానికి వెళ్ళాడు. గిత్తలకు మేతవేసి గంగడోలు నిమిరి మచ్చు మీద నుంచి కొత్త పిగమోరలూ, మొహం పట్టాలూ, వడుంవార్లూ, కుచ్చుల చెర్నాకోలా బైటకి తీశాడు. గిత్తల్ని చెరువుకి తోలుకెళ్ళి వరి చెత్తతో శుభ్రంగా తోమి కడిగాడు. గులాం చల్లాడు. పొద్దెక్కుతుండగా చౌదరయ్య వర్గం ఊరికి సెడగా వున్న శివాలయానికి వెళ్ళింది. పూజా పురస్కారాలయిన తర్వాత ఊరేగింపు బయల్దేరింది. వారిగాడు గిత్తల్ని దేవుడి బండికి గట్టాడు. పగ్గాలు కొడుక్కిచ్చి తను తప్పెట చేతబూని చిందేస్తూ బండి ముందు బయల్దేరాడు. తప్పెట్లు తాళాలతో, భోగంవాళ్ళ తైతక్కలతో ఊరు హోరెత్తిపోతోంది.

దేవుడి బండి ఇంటింటి ముందూ ఆగుతోంది. జనం హారతి పోస్తున్నారు. టెంకాయలు కొడుతున్నారు. కానుకలు వేస్తున్నారు. బండి పల్లం వీధికి మళ్ళింది. మునసబు మూత వీధి అది.

వీధి మధ్యకి వెళ్ళేసరికి అటువేపునుంచి రెండో ఊరేగింపు ఎదురైంది. తప్పుకునిపోయే వీలులేదు. రెండు వర్గాలవాళ్ళూ ఎదురు బొదురుగా ఆగి పోయారు. తప్పెట్లు, డొన్నులు ఆగిపోయాయి. చౌదరయ్య వారిగాడికి కన్ను మలిపాడు. వారిగాడు ముందుకొచ్చి మునసబు బండి పగ్గాలు పుచ్చుకు నిలబడ్డ వెంకటయ్యతో అన్నాడు.

"ఓ రెంకా! కొత్త బండెనక్కిలాగు. మా బండి దాటినాక మళ్ళొద్దువుగాని."

"మా బండి యెనక్కెల్లేది గాదు."

"ఎల్లకపోతే నీ మీదగా ఎల్తాం. మరేదగా తప్పుకో."

"తప్పదు సన్ను సేసేవోల్లు తప్పుకు పోవాల. మరేద నీదెగ్గిర నేర్చుకునేటోల్లం గాదు."

"ఎవ్వడా తప్పదు సన్ను సేసేది? నువ్వు జేత్తావు. నీ దొరబాబు జేత్తాడు. సాటుమాటున నాములు తగలబెట్టిచ్చేవాడు తప్పడోడుగాక యేమవుతడు?"

"మాటలు జవరంగా రానియ్యి. వుంకోసారి మాట తూలితే పీనిగెల్లుద్దిక్కడ."

"ఎవుడి పీనిగెల్లుద్దో అదీ సూద్దాం. రానీండ్రా బండి ముందుకి" అంటూ వారిగాడు తన వాళ్ళని హెచ్చరించి తప్పెట విసిరేసి బానా కర్రందుకుని ముందు కదు గేశాడు. "హరహరా" అనే అరుపుల మధ్య బండి కదిలింది. మునసబు మనుషులు తిరగబడ్డారు. కర్రలు లేచాయి. తలలు పుచ్చకాయల్లా పగిలాయి. నెత్తురు కాలవ గట్టింది. వారిగాడు దెబ్బలు కాచుకుంటూ

ముందుకెళ్ళి వీరావేశంతో ఒక్కసారిగా మునసబు బండి పోలుమీదకి దూకాడు. మరుక్షణం తొట్లో కూర్చున్న మునసబు పుర్రె పగలాల్సిందిగానీ దెబ్బ తప్పి జారి భుజం మీద పడింది. మునసబు కుప్పగూలిపోయాడు. నారిగాడు మళ్ళీ కర్రెత్తే పాటికి మునసబు మనుషులు కమ్మేశారు. నలుగుర్ని పడగొట్టిన తర్వాత దెబ్బలకి తాళలేక నారిగాడు కూలిపోయాడు. యుద్ధం ముగిసింది. అటిద్దరూ ఇటిద్దరూ తలలు పగిలి చచ్చారు. మునసబు చెయ్యి విరిగింది. నారిగాడికి దెబ్బలు బలంగా తగిలాయి. పోలీసులు వచ్చారు. కేసులు మొదలయ్యాయి. కానీ రగులుకున్న కాష్ఠం ఆరలేదు. పొలం గట్లమీద, డొంకల్లో, బీళ్ళల్లో దొరికిన వాళ్ళను దొరికినట్టు చితక బాదుతున్నారు. వాములు తగలబడుతున్నాయి, కొంపలంటుకుంటున్నాయి. ఇల్లుదాటి బయటికి అడుగు పెట్టాలంటే ప్రతివాడికీ భయమే. తమ నీడని చూసి తామే ఉలిక్కిపడుతున్నారు. ఊరు అట్టుడికినట్టు ఉడికిపోతోంది.

* * *

సుబ్బయ్య యింట్లోంచి కాలు కదపటం లేదు. వీధి తలుపులు బిడాయించి భార్య, కొడుకుతోపాటు లోపల కూర్చుంటాడు. గది బయట ఎల్లప్పుడూ నారిగాడి కాపలా. నారిగాడెప్పుడూ భవంతి లోనికి వెళ్ళలేదు. అయినా భవంతిలో ఏ గదుల్లో ఏమేం వున్నాయో, దొరయ్య డబ్బు పాతరెక్కడో వాడికి క్షుణ్ణంగా తెలుసు. పాతదైనా లంకంత ఇల్లు. పుట్టినప్పటి నుంచి నారిగాడక్కడే పనిపాటల్లో పెరిగాడు. వాడు పదిమంది పెట్టు. వంద కిలోల జొన్నల బస్తాని అవలీలగా మోసేవాడు. వాడు తెచ్చిన గడ్డిమోపు మొయ్యాలంటే యిద్దరికైనా అలివయ్యేది కాదు. పగలంతా వళ్ళు విరుచుకుని రాత్రి దొరసాని లక్ష్మమ్మ పెట్టిన కూడు కడుపునిండా తిని కొట్టంలో గురకబెట్టి నిద్రపొయ్యేవాడు. తప్పితే ఎప్పుడైనా గుడిసెకి వెళ్ళొచ్చేవాడు. నారిగాడి జీవితం ఆ భవంతితో ముడిపడిపోయింది. అక్కడే పుట్టాడు, అక్కడే పండాడు, అక్కడే చస్తాడు. ఆ భవంతి వాడిది కాక మరెవరిదవుతుంది?

చవితి సంబరాలు గడిచి మాసమైంది. ఊళ్ళో కక్షలూ, కావేషాలు కాస్త చల్లారినట్టయ్యింది. సుబ్బయ్య దొరరి ఇప్పుడిప్పుడే బయటి మొహం చూస్తున్నాడు. ఇంతలో పట్నం నుంచి మనిషొచ్చాడు. కేసు గురించి మాట్లాడి పొమ్మని, డబ్బు పట్టుకు రమ్మని, ప్లీడరు కబురు చేశాడు. జరూరు పని. దొరయ్యకి ఇల్లు గదలక తప్పలేదు. పస్తాయిస్తూనే రాత్రి నడిజాముున అతి రహస్యంగా బయల్దేరాడు. ఇంటి దగ్గర దిట్టమైన మనుషుల్ని ఐదుగురి నుంచాడు భార్యకీ, కొడుక్కీ కాపుదలగా. బాణాకర్ర పట్టిన నారిగాడు బాటరీ లైటుతో ముందు నడుస్తుంటే వెనక నలుగురు కాపులో అసలు దారికాక డొంక దారి బట్టాడు దొరయ్య. మూడు మైళ్ళు నడిచినా మనిషి అలికిడి లేదు. ఇంకో మైలు వెళితే రోడ్డొస్తుంది. రోడ్డెక్కితే ఒక్క లగూతో పట్నం పొలిమేరలు చేరొచ్చు. దొరయ్య వెన్నుగాస్తున్న నలుగుర్నీ ఇంటికి వెళ్ళి జాగ్రత్తగా కావలి గాయమని




పంపించాడు. మర్నాటి రాత్రి మళ్ళీ రోడ్డు దగ్గరికి రమ్మన్నాడు.

నారిగాడు ముందుకి దారితీశాడు మాటా పలుకూ లేకుండా. దొరయ్య వెనక్కి తిరిగి చూస్తూ అనుసరిస్తున్నాడు. ఉన్నట్టుండి ఎందుకో నారిగాడి వెన్ను జలదరించింది. 'శా పిరికి నాయాలా!' అని తనని తానే తిట్టుకుని నడుస్తున్నాడు. చవుళ్ళలోకి వచ్చారు. పిచ్చి పిచ్చిగా పెరిగిన తుమ్మలు జుట్టు విరబోసుకున్న దెయ్యాల్లా కన్పిస్తున్నాయి. కీచురాళ్ళ రొద భయంకరంగా విన్పిస్తోంది. చవుళ్ళు దాటితే రోడ్డు. ఇంతలో తుమ్మల చాటునుంచి నలుగురు దుక్కల్లాంటి మనుషులు వచ్చి దారికడ్డంగా నిలబడ్డారు. నలుగురి చేతుల్లో బరిసెలు. దొరయ్య పై ప్రాణాలు పైనే పోయాయి. మనుషుల్ని వెనక్కి పంపటం మోసమైందనుకున్నాడు. తెగించి కర్ర గట్టిగా చేతబట్టి నిలబడ్డాడు. నారిగాడికి వీరావేశం వచ్చింది.

"దొరా! నేను బతికుండగా తవరి వంటిమీద ఈగ వాలనియ్యను. రాండిరా నా కొడకల్లారా! ఇయ్యాల మీ నెత్తురు కళ్ళ జూస్తాను. అశ్శరభ శరభో! " అంటూ ఎగిరి వాళ్ళ మీదికి దూకాడు.

ఆ చీకట్లో ఎవరెవర్ని కొడుతున్నారో అర్థం కాలేదు. దొరయ్య కర్ర అడ్డం పెట్టి దెబ్బలు కాచుకుంటున్నాడు. నారిగాడు దొరయ్య చుట్టూ తిరుగుతూ నలుగుర్ని సెలకొట్టనియ్యలేదు. ఒకణ్ణి పడగొట్టాడు. చేతిలో కర్ర గరిడీ సాముల్లో తిరిగినట్టు తిరుగుతోంది. 'ఫట్ ఫట్' మనే మోతలు విన్పిస్తున్నాయి. వాళ్ళూ తక్కువ తినలేదు. అందులో ఒకడు నారిగాడి ధాటికి తగ్గినట్టే తగ్గి వెనకపాటుగా వచ్చి బరిసెతో పొడిచాడు. నారిగాడి వీపు నెత్తురు కొల్లయ్యింది. కళ్ళు బైర్లు గమ్ముతున్నాయి. బలం తగ్గిపోతోంది. దెబ్బ తీయటం అటుంచి దెబ్బ కాచుకోవటమే కనాకష్టమైంది.

"దొరా! తవరు పారిపోండి. ఈళ్ళని నేను నిలేత్తాను." అని కర్ర తిప్పుతూనే అరిచాడు నారిగాడు.

దొరయ్య ప్రాణ భయంతో కర్ర విసిరేసి పరుగు లంకించుకున్నాడు. వాళ్ళు వెంటపడ్డారు. కానీ నారిగాడు అడ్డు తగిలాడు. చావు తెగింపుతో పొలికేక పెట్టి వాళ్ళమీద పడ్డాడు. ఒకడి కొంకులు విరగ్గొట్టాడు. రెండోవాడి తల పుచ్చకాయలా పగిలింది, మూడోవాణ్ణి ఆఖరి దెబ్బ కొట్టి కూలిపోయాడు నారిగాడు.

దొరయ్య చావు బతుకుల్తో ముళ్ళూ, తుప్పలూ కానకుండా ఊళ్ళోకి పరిగెత్తాడు. పాలేళ్ళకి సంగతి చెప్పాడు. నిముషంలో వీధి వీధంతా నిద్ర లేచింది. ముప్పై మంది మెరికల్లాంటి మనుషులు లాంతర్లు పుచ్చుకుని కర్రల్తో, బరిసెల్తో ఉరుకులు పరుగులు మీద చవుళ్ళలోకి వచ్చి పడ్డారు. రక్తం మడుగులో కొన వూపిరితో నారిగాడు. చుట్టూ నాలుగు శరీరాలు. అరెకరం మేర నేల నేలంతా కల్లం జేసినట్టుంది. చేతులమీద నారిగాణ్ణి వాడి గుడిసెకి చేర్చారు. దొరయ్య ఎప్పుడూ పాట్లోకి అడుగు పెట్టనివాడు- తనూ వెళ్ళాడు. చుట్టూ జనం. మంగి శోకాలు పెట్టి ఏడుస్తోంది.

"నన్ను దిక్కులేని దాన్ని జేసిపోతివి గదరో దేవుడా! దొరలంతా సల్లగుండంగా నీకు నడమంత్రపు సావొచ్చింది గదరో! మాయదారి దొరకోసం బలైపోతివి గదరో దేవుడా!"

ఒళ్ళంతా రక్తంతో మూలుగుతున్నాడు నారిగాడు. ఏనాడూ కంటనీరు పెట్టని దొరయ్య కళ్ళల్లో నీటి పొరలు గమ్మాయి. తనతో పుట్టి, తనతో పెరిగిన నారిగాడు తనకోసం నెత్తురు ధారపోసినందుకో, తన మేడల్ని, మిద్దెల్ని పెంచి తన గాదెల్ని నింపి, పాడు గుడిసెలో అదవ చావు చస్తున్నందుకో, లేక నారిగాడు పోతే తనకి వెన్నుకాపు లేనందుకో—మరెందుకో దొరయ్యే చెప్పాలి.

నారిగాడు చివరి సారిగా కళ్ళు విప్పాడు. దొర వంక చూశాడు. ఆ చూపుల్లో అదే చూసిపోని విశ్వాసం. యజమాని కాళ్ళు నాకే కుక్క చూపుల్లోని విశ్వాసం. కొడుకు చేతిని దొర చేతిలోపెట్టి కన్ను మూశాడు నారిగాడు. మంగి గొల్లుమంది. నారిగా[illegible] ర మరణం' పొందాడు! మర్నాడు తప్పెట్లతో, [illegible] లతో నారిగాడి శవాన్ని ఊరేగించి దహనం చేశ[illegible] .. వాడి యింట్లో చిల్లిగవ్వ లేకపోవటంవల్ల చావు కర్చంతా దొరయ్యే పెట్టాడు.

ఈ కథ యింతటితో ఆగదు. నారిగాడి స్థానాన్ని వాడి కొడుకు ఆక్రమిస్తాడు. కాలం గడిచి రెండో నారిగాడు చిన్న దొరకి నమ్మిన బంటవుతాడు. చిన్న దొర పొలం యాభైనుంచి వందెకరాలవుతుంది. వాడి గుడిసె మాత్రం పాడుబడుతుంది. ఊళ్ళో మళ్ళీ ఎలక్షను తగాదాలొస్తాయి. ఇద్దర్ని చంపి జైలుకెళతాడు వాడు. లేదా దొరకోసం ప్రాణాలు బలిపెడతాడు. వాడి వంశమే అంత! నారిగాళ్ళు లేనిదే దొరయ్యలు లేరు.